# తిరగబడ్డ జనం

## ఇండ్ల స్థలాల కోసం.. హెచ్‌ఎండీఏ భూముల ఆక్రమణకు యత్నం

సిటీబ్యూరో/మియాపూర్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. పేద ప్రజలు హెచ్‌ఎండీఏ భూములను ఆక్రమించేందుకు యత్నించడం ఉద్రిక్తతకు దారితీసింది. మియాపూర్‌లో హెచ్‌ఎండీఏకు ప్రభుత్వ కేటాయించిన సర్వే నంబర్ 100,101లలో సుమారు 450 ఎకరాల దాకా స్థలం ఉన్నది. దాన్ని ఎప్పటి నుంచో కబ్జా చేయాలని చాలా మంది ప్రయత్నిస్తున్నా.. హెచ్‌ఎండీఏ అడ్డుకుంటోంది. ఈ భూముల్లో పేదలకు ఇండ్ల స్థలాలు ఇస్తున్నారంటూ ప్రచారం జరగటంతో నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. శుక్రవారం నుంచే వేలాది మంది హెచ్‌ఎండీఏ ఆధీనంలో ఉన్న భూముల్లోకి వచ్చి తమకు స్థలాలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. భూములను అక్రమిస్తున్నారని ఆలస్యంగా తెలుసుకున్న హెచ్‌ఎండీఏ అధికారులు.. స్థానిక పోలీసులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. ప్రభుత్వ స్థలాన్ని వదిలేసి వెళ్లిపోవాలని పోలీసులు చెప్పినా.. వినకుండా అక్కడే ప్రజలు కూర్చిండిపోయారు. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టే ప్రయత్నం చేసినా..కదలలేదు. పైగా రాళ్లతో దాడి చేయడంతో పోలీసులు తప్పించుకునేందుకు పరుగులు పెట్టారు. పెద్ద ఎత్తున మోహరించిన పోలీసు బలగాలు అక్కడి నుంచి ప్రజలను పంపించేందుకు ప్రయత్నం చేసినా, వారి నుంచి ఎదురు దాడి ఎదురైంది.

ప్రజలు రాళ్ల దాడి చేయడంతో పరుగులుపెడుతున్న పోలీసులు

### స్థలంపై సుప్రీం కోర్టులో స్టే ఉంది

-హెచ్‌ఎండీఏ ఎస్టేట్ ఆఫీసర్ శివారెడ్డి

మియాపూర్‌లోని సర్వే నంబర్ 100,101లలో హెచ్‌ఎండీఏకు సుమారు 450 ఎకరాల దాకా భూమి ఉన్నది. ఇందులో గతంలో ఇంటర్‌సిటీ బస్ టర్మినల్ కోసం 100 ఎకరాలను కేటాయించి, ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ తర్వాత ఆ ప్రాజెక్టు నిలిచిపోయింది. ప్రస్తుతం రెండు సర్వే నంబర్లలో ఉన్న భూములపై సుప్రీం కోర్టులో స్టే ఉండడంతో అందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేదు. ఎవరైనా ఆక్రమించి నిర్మాణాలు చేస్తే కూల్చివేయిస్తున్నాం. రెండు రోజులుగా పేద ప్రజలు స్థలాలు ఇవ్వాలంటూ హెచ్‌ఎండీఏ ఆధీనంలో ఉన్న స్థలంలో వేల సంఖ్యలో వచ్చారు. వారందరికీ ఆ భూమికి సంబంధించిన వివరాలను తెలియజేశాం. పట్టాలు గానీ, ఇండ్ల స్థలాలు ఇవ్వడం లేదని చెప్పాం. అయినా వారు అక్కడి నుంచి వెళ్లడం లేదు. హెచ్‌ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీఎస్పీ, సీఐతో పాటు ప్రత్యేక పోలీసు సిబ్బంది స్థలంలోనే ఉండి వారు గుడిసెలు వేసి ఆక్రమించుకోకుండా అడ్డుకుంటున్నాం.

### చట్ట విరుద్ధంగా అక్రమించడం సరికాదు: డీసీపీ వినీత్

ప్రభుత్వ స్థలాను ఆక్రమిస్తే చట్ట పరంగా కఠిన చర్యలు ఉంటాయి. హెచ్‌ఎండీఏ స్థలంలోకి వచ్చిన వారికి పోలీసులు ఎంతో ప్రశాంతంగా స్థలాన్ని విడిచివెళ్లిపోవాలని చెప్పారు. అది విని కొందరు వెళ్లిపోయారు. అయినా ఇంకా చాలా మంది స్థలంలో ఉండి మాకు స్థలాలు కావాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

ఇండ్ల స్థలాలు ఇవ్వాలంటూ..హెచ్‌ఎండీఏ భూముల వద్ద గుమిగూడిన పేదలు

కాటేదాన్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

## బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలి

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 22: దేశానికి మణిహారంగా ఉన్న సింగరేణి సంస్థను దివాలా తీయించే విధంగా కేంద్రంలో మోడీ ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం పాట ప్రారంభించిందని, బొగ్గు బ్లాకులను నేరుగా సింగరేణికి కేటాయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్‌లు కోరారు. సింగరేణి బ్లాకుల వేలాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కాటేదాన్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ప్లకార్డులు చేపట్టి, నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి.. హైదరాబాద్‌లోనే వేలం ప్రక్రియ ప్రారంభించడం ఆందోళనకరంగా ఉందన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా పాల్గొనడం ఆశ్చర్యకరమన్నారు. ఒక వైపు బొగ్గు బ్లాకును వేలం వేస్తూ, మరోకవైపు సింగరేణిని ప్రైవేటీకరించబోమని మంత్రి కిషన్‌రెడ్డి బుకాయిస్తున్నారన్నారు. తక్షణమే వేలం పాట రద్దు చేయాలని, సింగరేణికే బొగ్గు బ్లాకులు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కవిత, ఉపాధ్యక్షులు జాజాల రుద్ర కుమార్, సాయిబాబా, సలహాదారులు ఎస్.రామ్మోహన్ రావు, అలీ దేవేందర్, వీరయ్య, జె.పెంటయ్య, బుట్టి బాలరాజు, నర్సింహా, బుగ్గ రాములు, ఎల్లేశ్, కాటేదాన్ క్లస్టర్ నాయకులు వెంకటేశ్ గౌడ్, బాలరాజ్, జాంగిర్, సచిన్, ప్రవీణ్, శశికాంత్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ చోరీకి వచ్చి.. మృత్యువాత

మెహిదీపట్నం జూన్ 22: సెల్‌ఫోన్ చోరీకి వచ్చిన ఓ యువకుడిని.. భవన నిర్మాణ కూలీలు పట్టుకుని కొట్టగా అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెహిదీపట్నం సంతోష్‌నగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన షన్వర్ షేక్, సలీం షేక్‌లు ఆరునెలలుగా కూలీలుగా పనిచేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున వీరు నిద్రపోతుండగా మాసాబ్‌ట్యాంక్, అహ్మద్‌నగర్ ఫస్ట్‌లాన్సర్‌కు చెందిన సమీర్ సెల్‌ఫోన్ చోరీ చేసి తీసుకెళ్తున్నాడు. గమనించిన షన్వర్ షేక్ అతడిని పట్టుకునే క్రమంలో దొంగ కత్తితో దాడికి యత్నించాడు. వెంటనే తేరుకున్న వారిద్దరు దొంగనుంచి కత్తి లాక్కోని.. అతడి తలపై కొట్టి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి గాయాలకు గురైన సమీర్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా.. ఆత్మరక్షణ కోసం ధైర్యం చూపిన వారిద్దరిని డీసీపీ అభినందించారు. కాగా.. సాయంత్రం వరకు మృతుడి వివరాలు పోలీసులకు తెలియలేదు. అతడి ఫొటోను సోషల్‌మీడియాలో వేయడమే కాకుండా, ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో చూపుతూ విచారణ చేపట్టగా అహ్మద్‌నగర్ ఫస్ట్‌లాన్సర్‌లో స్థానికులు అతడిని సమీర్‌గా గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బీఆర్ఎస్ అధినేతను కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే

అమెరికా పర్యటన ముగించుకుని ఇండియాకు తిరిగి వచ్చిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శనివారం బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి తదితరులు ఉన్నారు. -షాబాద్, జూన్ 22

## ఫిర్యాదు రాగానే స్పందించాలి

- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి
- పోలీసు అధికారులతో పరిచయ కార్యక్రమం

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్ 22 : పోలీస్ అధికారులు ఫిర్యాదుదారులతో ఓపికగా మాట్లాడాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఠాణాలకు వచ్చే బాధితులకు ప్రశాంత వాతావరణం కల్పించి, వారితో ఓపికతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. అదేవిధంగా ఠాణాల పరిధుల్లో, ముఖ్యమైన కూడళ్లలో సీసీటీవీల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. జిల్లాలో నమోదైన కేసుల్లో నిందితులకు శిక్షపడేలా కేసులను ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేసి, అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, కరుణసాగర్‌రెడ్డి, జిల్లా వర్టికల్ ఇన్‌చార్జి డీఎస్పీ జానయ్య, ఏఆర్‌డీఎస్పీ వీరేశ్, ఇన్‌స్పెక్టర్లు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

### గోడ దూకుతూ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి

## విద్యార్థికి తీవ్ర గాయాలు

### స్కూల్ నుంచి పారిపోయేందుకు యత్నం

షాద్‌నగర్ రూరల్, జూన్ 22 : స్కూల్ నుంచి పారిపోయేందుకు యత్నించి.. గోడ దూకుతూ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడడంపై ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన షాద్‌నగర్ పట్టణంలో శనివారం జరిగింది. షాద్‌నగర్‌కు చెందిన అర్మాన్ అనే తొమ్మిదేండ్ల విద్యార్థి పట్టణంలోని ఓ పాఠశాలలో చదువుతున్నాడు. శనివారం పాఠశాలకెళ్లిన అతడు పారిపోయేందుకు యత్నించాడు. స్కూల్ ఆవరణలోని గోడ సమీపంలో ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే అర్మాన్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఇదిలా ఉంటే పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయని.. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

## భారతీయ నూతన నేర చట్టాలపై న్యాయవాదులకు శిక్షణ

సిటీబ్యూరో, జూన్ 22 (నమస్తే తెలంగాణ) : భారతీయ నూతన నేర చట్టాలపై తెలంగాణలోని న్యాయవాదులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పా జంక్షన్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీలో రెండు రోజుల సదస్సును ఏర్పాటు చేయగా.. శనివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయనతోపాటు జస్టిస్ సామ్ కోషి, తెలంగాణ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ నరసింహారెడ్డి, తెలంగాణ జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ డా. ఎం రాజేందర్‌తోపాటు పలువురు ప్రముఖ న్యాయవాదులు పాల్గొన్నారు. జులై 1 నుంచి అమలులోకి రానున్న భారతీయ నేర చట్టాలపై అవగాహన కల్పించేలా నిర్వహించిన ఈ రెండ్రోజుల సదస్సు న్యాయవాదులకు ఎంతగానో తోడ్పడుతుందని జస్టిస్ సుజోయ్ పాల్ అన్నారు. పాత, నూతన చట్టాల మధ్య తేడాలను తెలుసుకునేందుకు యువ న్యాయవాదులు రెండింటిని చదవడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు.

# నీట్‌ను రద్దు చేయాలి

### కేంద్రప్రభుత్వ నిర్లక్ష్యంతోనే లీకేజీ..
### అవకతవకలపై విచారణ జరిపించి రద్దు చేయాలి
### నిరసనగా కేంద్రమంత్రి ఇంటి ముట్టడి..
### విద్యార్థుల సంఘాల ఆందోళన.. రాస్తారోకో, ర్యాలీలు

ఉస్మానియా యూనివర్సిటీ/ కాచిగూడ, జూన్ 22: నీట్ పరీక్ష లీకేజీపై విద్యార్థి సంఘాలతోపాటు పలువురు నేతలు భగ్గుమన్నారు. పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. శనివారం నగరంలో రాస్తారోకోలు నిర్వహించి.. నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు చేపట్టారు.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

- నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ నిరాహార దీక్షకు దిగారు. ఉస్మానియా యూనివర్సిటీ మెయిన్ లైబ్రరీ ఎదుట దీక్షకు దిగిన ఆయనకు ఓయూ అధ్యాపకులు ప్రొఫెసర్ కాశీం, డాక్టర్ కొండా నాగేశ్వర్‌రావు నిమ్మరసం అందించి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ..నీట్ ఫలితాలు విడుదలై నేటికి 18 రోజులు గడుస్తున్నా కేంద్రప్రభుత్వం లీకేజీకి పాల్పడిన దోషులను శిక్షించడంలో విఫలమైందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరితో దేశంలో 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ అవకతవకల్లో బీజేపీ ఎంపీల హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష నిర్వహణను ఎన్టీఏ నుంచి సీబీఎస్‌కు అప్పగించాలని డిమాండ్ చేశారు. దీక్షలో విద్యార్థి నాయకులు నెల్లి సత్య, వినయ్, సాయిగౌడ్, సుమన్‌గౌడ్, మోతీలాల్‌నాయక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.
- నీట్ పరీక్ష అవకతవకలపై విచారణ జరిపించి.. రద్దు చేయాలని కోరుతూ.. ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, పీవైఎల్, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్, వీజేఎస్ విద్యార్థి సంఘాలు బర్కత్‌పురలోని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటిని ముట్టడించారు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి నేతృత్వంలో వివిధ సంఘాల విద్యార్థులను అరెస్ట్ చేసి, వివిధ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.
- నీట్ పరీక్ష లీకేజీలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని.. కేంద్రప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నీట్ లీకేజీలు జరిగాయని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. నీట్ పరీక్ష లీకేజీ, అవకతవకలపై విచారణ జరిపి, ఎన్‌టీఏను రద్దు చేయాలని కోరుతూ వివిధ బీసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆయన.. బర్కత్‌పుర సర్కిల్‌లో వేలాది మంది విద్యార్థులతో ధర్నాతో పాటు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు న్యాయం చేసి, లీకేజీలకు కారణమైన దోషులను తక్షణమే చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం,నీలం వెంకటేశ్, రాజేందర్, నందగోపాల్, అనంతయ్య, రామకృష్ణ, సురేశ్, ఉదయ్, రాజ్‌కుమార్, జయంతిగౌడ్, నిఖిల్, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నీట్ పరీక్ష లీకేజీపై విచారణ జరిపి,ఎన్‌టీఏను రద్దు చేయాలని కోరుతూ బర్కత్‌పుర సర్కిల్‌లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం తదితరులు

## జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు మరికల్ పాఠశాల విద్యార్థి ఎంపిక

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపికైన విశాల్ రూపొందించిన నమూనా

కులకచర్ల, జూన్ 22 : మరికల్ ఉన్నత పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థి జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపికయ్యాడు. చౌడాపూర్ మండలంలోని కొత్తపల్లి తండా గ్రామానికి చెందిన విశాల్ మరికల్ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్నాడు. స్కూల్‌కు చెందిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు రవికుమార్ మార్గదర్శకత్వంలో ఆటోమెటిక్ సేఫ్టీ ఎలక్ట్రిక్ పోల్ అనే ప్రాజెక్టును రూపొందించాడు. వర్షాకాలంలో విద్యుత్తు స్తంభాల దగ్గర విద్యుదాఘాతాలు జరుగుతుంటాయి. వాటి నియంత్రణకు ఎలక్ట్రిక్ పోల్ వద్ద కాపర్ తీగను ఆర్డీనో ఐఆర్ సెన్సార్ ఇన్సులేటర్లు, బ్యాటరీ వంటి పరికరాలను అమర్చితే వాన కురిసినప్పుడు విద్యుత్తు స్తంభాల షాక్ నుంచి రక్షించే వ్యవస్థను కనుగొన్నారు. ఈ సందర్భంగా విశాల్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సర్వమంగళ, ఉపాధ్యాయ బృందం అభినందించారు. గతేడాది కూడా సైన్స్ ఫెయిర్‌లో రవికుమార్ ఆధ్వర్యంలో నీటిని ఇంధనంగా చేసుకొని నడిచే వాహనాన్ని అతడు రూపొందించగా.. ఆ ప్రయోగం సౌత్ ఇండియా స్థాయిలో ఎంపికైంది. పాఠశాలకు పేరు తీసుకొచ్చిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు రవికుమార్‌ను గ్రామస్తులు అభినందించారు.

## క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

పాఠశాల ఎన్నికల కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చేవెళ్ల రూరల్, జూన్ 22 : క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని పల్లవి విద్యాసంస్థల చైర్మన్ కొమరయ్య అన్నారు. శనివారం మొయినాబాద్ మండలం గండిపేటలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో నూతన విద్యార్థి నాయకుల ఎన్నికల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మొయినాబాద్ సీఐ కిషన్‌సింగ్ హాజరై కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ముందుగా నూతన నాయకులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి కార్యక్రమంలో వారు మాట్లాడారు. నూతన విద్యార్థి నాయకులు, ఎన్‌సీసీ విద్యార్థులు కవాతు చేసి గౌరవ వందనం సమర్పించారు. స్కూల్ అంబాసిడర్‌గా సృష్టిశ్రీవాత్సవ్, విద్యార్థి నాయకుడు మాస్టర్ గౌరవ్‌కుమార్, విద్యార్థిని నాయకురాలు కుమారి నేహాపాఠక్ మాట్లాడారు. కార్యక్రమంలో పల్లవి విద్యాసంస్థల సీవోవో, డైరెక్టర్ యశస్వి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమ, ఉప ప్రధానోపాధ్యాయురాలు మీను, పాఠశాల సీసీఏ ఇన్‌చార్జి ప్రియాంకామాథుర్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగాల పేరిట మోసం.. కన్సల్టెన్సీపై కేసు

వెంగళరావునగర్, జూన్ 22 : ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి.. డబ్బులు తీసుకుని ఓ కన్సల్టెన్సీ మోసానికి పాల్పడింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమీర్‌పేటలోని ఎస్‌యూబీఎస్ కన్సల్టెన్సీని ఉషారామి బెహరా అనే మహిళ నిర్వహిస్తుంది. తార్నాకకు చెందిన కృష్ణవైతన్య ఉద్యోగం కోసం ఈ కన్సల్టెన్సీని సంప్రదించగా..బాధితుడి నుంచి రూ.1,80,000 తీసుకుని బెంగళూరులోని ప్యారా లోయల్ కంపెనీలో జాబ్ పెట్టించారు. నెలకు రూ.13 వేలు ప్రొబేషనరి పీరియడ్ అనిచెప్పి.. ఆరు నెలలు ఉద్యోగం చేయించుకుని తొలగించారు. తిరిగి వచ్చి కన్సల్టెన్సీని సంప్రదించగా ల్యూరిట్ బిజినెస్ రిలేషన్స్ అనే మరో కంపెనీలో చేర్పించారు. అక్కడ కూడా జీతాలు ఇవ్వలేదు. దీంతో మోసపోయానని గుర్తించిన బాధితుడు కన్సల్టెన్సీ వద్దకు వెళ్లగా.. అప్పటికే మరో 25 మంది నిరుద్యోగులు మోసపోయి అక్కడికి వచ్చారు. వీరంతా కన్సల్టెన్సీ వద్ద ఆందోళన చేపట్టి.. డయల్ 100కు సమాచారం అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# బాల్యంపై బ్యాగు భారం

- ఏటా పెరుగుతున్న పాఠ్య పుస్తకాలు
- వయసుకు మించిన బరువుతో ఎదుగుదలకు ఆటంకం

యాచారం, జూన్ 22 : ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన వయసులో విద్యార్థులకు పుస్తకాల భారం శాపంగా మారుతున్నది. ప్రతి ఏటా పై తరగతులకు వెళ్తుంటే పుస్తకాల సంఖ్య కూడా దానికి తగట్టుగానే పెరుగుతున్నది. ప్రైవేట్ పాఠశాలల్లో ఈ సమస్య మరింత అధికం. ఆ బడుల్లో చదివే చిన్నారులు బ్యాగుల నిండా పుస్తకాలతో నాలుగైదు అంతస్తుల బిల్డింగులు ఎక్కుతూ..దిగుతూ నానా అవస్థలు పడుతుంటారు. స్కూల్ బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు వారి బాధలు వర్ణనాతీతం. పుస్తకాల భారం తగ్గించాలని 2006లో చట్టం తెచ్చినా దానిని పాఠశాలల నిర్వాహకులు పట్టించుకోవడంలేదు. దీంతో భుజంపై వయసుకు మించిన పుస్తకాల బ్యాగులు, చేతుల్లో లంచ్ బాక్స్‌ల భారాన్ని చిన్నారులు మోయాల్సిన దుస్థితి నెలకొన్నది.

### పట్టని నిబంధనలు..

ప్రభుత్వం, ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూళ్లు విధిగా సర్కారు ముద్రించిన పాఠ్యపుస్తకాలతోనే విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాలి. స్టేట్, సీబీఎస్ఈ సిలబస్ మినహా మరే ఇతర పాఠ్యాంశాలను బోధించొద్దనే నిబంధనలున్నాయి. అయినా అవి ఎక్కడా అమలు కావడంలేదు. ప్రైవేట్ పాఠశాలలు ఐఐటీ కోచింగ్, స్మార్ట్ క్లాసులు, రివిజన్ టెస్టుల పేరుతో సాధారణ పుస్తకాలతోపాటు అదనంగా ప్రైవేట్ పుస్తకాలను జత చేయడంతో విద్యార్థులకు అధిక భారమవుతున్నది. పైగా వాటిని తప్పనిసరిగా పాఠశాలల్లోనే కొనాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వాటికి అదనంగా డబ్బులు దండుకుంటున్నారు.

### అనవసరమైనవే అధికం..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు ఆరు పాఠ్యపుస్తకాలు, మరో ఆరు నోట్‌బుక్స్, కాపీరైట్‌కు సంబంధించి అదనంగా నాలుగు నోట్ పుస్తకాలుంటాయి. ప్రైవేట్ బడుల్లో మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధం. ఒకటోతరగతి విద్యార్థికి సాధారణంగా 14 పుస్తకాలుండాలి. కానీ, సుమారు 31-34 పుస్తకాలు ఉంటున్నాయిని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రింటెడ్ కాపీరైట్, ప్రింటెడ్ కలర్ కంపోజింగ్, హోమ్ స్కూల్, ఎక్సర్‌సైజ్, రైటింగ్ ఇంప్రూమెంట్, లాంగ్వేజ్ డిక్షనరీ, డ్రాయింగ్, కంప్యూటర్, డైరీ ఇలా అనేక పుస్తకాలను అదనంగా జోడిస్తున్నారు. ఇక ఆరు నుంచి పదోతరగతి విద్యార్థుల బ్యాగు బరువులు వారికి కొండను మోసినట్లుగా ఉంటున్నదని విద్యార్థులు వాపోతున్నారు.

నిత్యం వాటిని మోస్తూ ఇబ్బందిపడుతున్నారు. అనవసరమైన పుస్తకాలను అదనంగా మోస్తుండడంతో చిన్నారుల వెన్నెముకపై తీవ్రమైన భారం పడుతున్న ది. దీంతో వారి ఎదుగుదల సక్రమంగా ఉండడంలేదు. ఏటా జిల్లా విద్యాశాఖ నుంచి వార్షిక ప్రణాళిక విడుదల అవుతుంది. పాఠ్యాంశాలు, పరీక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆరోగ్య పరిరక్షణ కింద పలు అంశాలతో కూడిన పట్టికను రూపొందిస్తారు. దానిని ప్రైవేట్ పాఠశాలల్లో సక్రమంగా అమలు చేయడంలేదు.

### వైద్య నిపుణులు ఏమి చెబుతున్నారంటే..

- విద్యార్థుల్లో 15 ఏండ్ల లోపే శరీరంలో వివిధ మార్పులు చోటుచేసుకుంటాయి.
- స్టూడెంట్స్ అధిక బరువును మోస్తే వెన్నెముక్క ఓ వైపు వంగిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి.
- విద్యార్థి బరువులో పుస్తకాల బరువు 15 శాతానికి మించరాదు.
- ఎక్కువ పుస్తకాలు ఉన్న పక్షంలో ఉపాధ్యాయుల సలహా మేరకు ఏ రోజున ఏ పుస్తకాలు కావాలో వాటినే తీసుకెళ్లేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.
- స్కూల్ బ్యాగును రెండు భుజాలపై సమాన బరువు పడేలా చూసుకోవాలి. ఒకవైపు అధిక బరువుతో వేలాడితే భుజం, మెడ నొప్పి వస్తుంది.
- బ్యాగు నడుము భాగం వరకు వేలాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పిల్లల ఎదుగుదల, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు వీలైనంత తక్కువ బరువు ఉండేలా చూసుకోవాలి.

### విద్యార్థుల్లో శారీరక సమస్యలొస్తాయి

విద్యార్థులు అధిక బరువును మోయడం వల్ల చిన్న వయసులోనే శారీరక సమస్యలు తలెత్తుతాయి. వెన్నెముక వంగిపోయే ప్రమాదమున్నది. అధిక బరువు గల బ్యాగులతో బస్సులు, భవనాలు ఎక్కడంతో శారీరకంగా, మానసికంగా అలసిపోతారు. విద్యార్థులు అధిక బరువుతో ఇబ్బందిపడకుండా తల్లిదండ్రులు తరచూ గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

-రాజ్యలక్ష్మి, మండల వైద్యాధికారిణి, యాచారం

### ప్రైవేట్ బడుల్లో పుస్తకాలు విక్రయించొద్దు

ప్రైవేట్ బడుల్లో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తే విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. డొనేషన్ల పేరుతో అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రైవేట్ బడుల నిర్వాహకులకు నోటీసులు ఇవ్వాలి. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలు, గుర్తింపులేని బడులను సీజ్ చేయాలి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆరేండ